టిడ్కో గృహవాసుల వెతలు

పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో టిడ్కో గృహ సముదాయం ఉంది. ఇక్కడ పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదలకు ప్రభుత్వం ఇళ్లను కేటాయించగా వచ్చి చేరారు. అయితే ఇప్పటి వరకు రేషన్‌షాపు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతినెలా పట్టణంలోకి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పింఛన్లకు సైతం అక్కడికే వెళ్లాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తమ వెతలను తీర్చాలని వేడుకుంటున్నారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కోగృహ సముదాయంలో నిర్మించిన 1057 గృహాలను గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో నివాసం ఉంటున్న సొంతిళ్లు లేని పేద, మధ్యతరగతి వర్గాల వారికి కేటాయించారు. అందులో 1050 గృహాల్లో లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. సుమారు 2500 మందికిపైగా జనాభా నివాసం ఉంటున్నారు. అయితే వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు రేషన్ షాపు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రతినెలా రేషన్ లబ్ధిదారులు పట్టణంలోకి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. టిడ్కోగృహ సముదాయం నెల్లూరు–ముంబయి జాతీయ రహదారి సమీపంలో ఉంటుంది. ఇక్కడ బస్సులు సక్రమంగా ఆపరు. దీంతో ఆటోలను తీసుకుని వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందజేస్తున్నా రేషన్ కార్డులు అక్కడే మ్యాపింగ్ అయిఉండంతో వారు సరుకులు ఇచ్చేందుకు రావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గతంలో వలంటీర్లు రేషన్ సమాచారం అందజేసేవారని, ఇప్పుడు వారు లేకపోవడంతో ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదని, రేషన్ ఇవ్వకపోతే ఉసూరుమంటూ తిరిగి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ లబ్ధిదారులకు తప్పని పాట్లు

ప్రభుత్వ గృహసముదాయంలో నివాసం ఉంటున్న పింఛన్ లబ్ధిదారులు ప్రతినెలా పింఛన్లు పొందేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పట్టణంలోని తమ పాత అడ్రస్సులకు వెళ్లి ప్రతి నెలా పింఛన్ తెచ్చుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నడవలేని వారికి వలంటీర్లు ఇక్కడకు వచ్చి పింఛన్లు అందజేసేవారు. ఇప్పుడు సచివాలయ సిబ్బంది అక్కడకు వస్తేనే పింఛన్ అందజేస్తామని చెబుతుండడంతో తమ బాధలు వర్ణనాతీతమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టిడ్కో గృహ సముదాయం

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని వినతి

టిడ్కో గృహసముదాయంలోని 1050 ఇళ్లలో సుమారు 2500మందికిపైగా జనాభా నివాసం ఉంటున్నారు. టిడ్కోగృహ సముదాయాన్ని ప్రత్యేక వార్డుగా ఏర్పాటు చేయాలని, లేకుంటే సమీపంలోని 23వ వార్డు లేదా కిలోమీటరు దూరంలో ఉన్న 1వ వార్డులో తమను కలిపి ఇక్కడే రేషన్ సరుకులు, పింఛన్లు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి నెలా ఇబ్బందులు పడుతున్నాం



గతంలో తాము పట్టణంలోని 13వ వార్డులో అద్దె ఇంట్లో ఉండే వాళ్లం. ప్రభుత్వం టిడ్కో ఇల్లు మంజూరు చేయడంతో సంతోషంగా చేరాం. ఇక్కడ రేషన్ షాపు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతినెలా పట్టణంలోకి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. పింఛన్లు కూడా అక్కడికే వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తమ సమస్యను పరిష్కరించాలి.

– మౌనిక, టిడ్కో గృహసముదాయం

ఆటో తీసుకుని వెళ్లాల్సి వస్తోంది



టిడ్కోగృహ సముదాయంలో రేషన్ షాపు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి నెలా ఐదుకిలోమీటర్ల దూరంలోని పట్టణంలోకి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇక్కడ బస్సులు కూడా సరిగా ఆపరు. ఆటో సౌకర్యం కూడా లేదు. ఆటో అద్దెకు మాట్లాడుకుని వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఇక్కడే సంక్షేమ పథకాలు అందేలా చూడాలి.

– జీ స్వాతి, టిడ్కోగృహ సముదాయం

సమస్యను పరిశీలిస్తాం

తాను కొత్తగా బదిలీపై వచ్చాను. టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న వారి సమస్యలను పరిశీలిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రేషన్, ఇతర సంక్షేమ పథకాలు ఇక్కడే అందేలా చర్యలు తీసుకుంటాం.

– సుధీర్, తహసీల్దార్

సంకుచిత విమర్శలు తగవు

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కమీషన్ల కోసం కావలిలో పనులు చేయలేదని కొందరు సంకుచిత విమర్శలు చేస్తున్నారని, కమీషన్లు తీసుకునే దుర్బుద్ధి తనకు ఉంటే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఫిషింగ్ హార్బర్ కాంట్రాక్ట్ పనులు చేపట్టేవారా అని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కావలిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.రూ.350 కోట్ల ఫిషింగ్ హార్బర్ కాంట్రాక్ట్ పనులు చేపట్టింది అప్పట్లో వైఎస్సార్‌సీపీలో ఉన్న ప్రస్తుత కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డేనని గుర్తుచేశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర, కృషి చేసింది వాస్తవమేనని, అప్పటి సీఎం వైఎస్ జగన్‌తో తాను మాట్లాడడం వల్లే నిర్మాణ పనులు మొదలయ్యాయని తెలిపారు. ఎన్నికల తర్వాత మత్స్యకారులకు బోట్లు అందజేసి ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభం చేద్దామని వైఎస్ జగన్ చెప్పారని, తాము అధికారంలోకి రాలేకపోవడంతో చేయలేకపోయామన్నారు. బుచ్చిరెడ్డిపాళెం–దగదర్తి, కొడవలూరు–ఇస్కపల్లి రోడ్ల నిర్మాణాలను తాము ప్రారంభించి చివరి దశకు తీసుకొచ్చామని గుర్తుచేశారు. పట్టణంలో రూ.55 కోట్లతో ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కళుగోళమ్మ గుడి వద్ద ఫ్లయిఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పాత కాంట్రాక్టర్‌ను తొలగించి దుత్తలూరు–కావలి జాతీయ రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు అప్పగించామని, త్వరలోనే పనులు మొదలవుతాయని చెప్పారు. కావలి నియోజకవర్గ రైతులకు పుష్కలంగా సాగునీరు అందించేందుకు సంగం బ్యారేజ్ వద్ద నుంచి బైపాస్ కెనాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ కాంట్రాక్ట్ పనులు ఎమ్మెల్యే దగుమాటికే దక్కాయని చెప్పారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాము అన్ని విధాలా కృషి చేసినా ప్రస్తుత ఎమ్మెల్యే దగుమాటి బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకుని దుష్ప్రచారం సాగిస్తున్నారన్నారు. అయినప్పటికీ తాను భయపడే వ్యక్తిని కాదన్నారు. ట్రంకు రోడ్డు విస్తరణ పనులు బృందావనం కాలనీ నుంచి ముసునూరు వరకు జరిగినట్లుగా, మద్దూరుపాడు వైపు జరగడం లేదన్నారు. రోడ్డు చివరన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, 20 అడుగులు వదిలేసి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రోడ్డు చివరగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, లేకపోతే భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రజలు మీకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, అభివృద్ధి పనులు చేపట్టి వారి మన్ననలు పొందాలని సూచించారు. తనపై దుష్ప్రచారం చేయడం వల్ల, కక్షపూరిత రాజకీయాలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరు మాల్యాద్రి, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, వేగూరు చిన్నపుల్లయ్య, కనుపర్తి రాజశేఖర్, సన్నిబోయిన ప్రసాద్, మునీర్,పేరం వెంకటేశ్వర్లు, వేణు,కుమారి రాజు, పుల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



సోమశిల: అనంతసాగరం పీహెచ్‌సీని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షయ పరీక్షలు చేపడుతున్న తీరు, క్షయ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం పాతదేవరాయపల్లి, రేవూరు గ్రామాల్లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యసిబ్బంది వెంకటేశ్వరరావు, సీహెచ్ సుధాకర్ ఉన్నారు.

ఉర్దూ పాఠశాలను తనిఖీ చేసిన డీఐ



ఆత్మకూరురూరల్: మండలంలోని అశ్వనీపురంలో ఉన్న ఉర్దూ పాఠశాలను ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఆయన వెంట హెచ్ఎం షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

ఉదయగిరి: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏ నరసింహులు పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్లకు బదులుగా వస్త్ర సంచులు వాడాలని కోరారు. ఫడ్స్ డైరెక్టర్ రమణయ్య, బీజేపీ నాయకుడు ఆవుల రోశయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ధ్వంసం.. ఆపై పోలీసులకు ఫిర్యాదు

అనుమసముద్రంపేట: దారి వివాదం కేసు కోర్టులో నడుస్తుండగానే మరుగుదొడ్ల ధ్వంసానికి పాల్పడిన ఘటన పెద్దబ్బీపురంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు హేమకుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మలిశెట్టి చంద్రభూషణ్‌రావు, హేమకుమార్ బంధువులు. వారి నడుమ ఇంటి దారి విషయంలో 2022 నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై హేమకుమార్ కోర్టులో కేసు వేసి ఉన్నారు. ఇది సహించని చంద్రభూషణ్‌రావు, మలిశెట్టి శ్రీనివాసరావు కుమారుడు అశోక్‌కుమార్ హేమకుమార్ ఇంట్లోకి చొరబడి మహిళలను దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు యత్నించారు. అంతటితో ఆగకుండా మరుగుదొడ్లను సైతం ధ్వంసం చేశారు. అనంతరం మహిళలు తమపై దాడి చేస్తున్నారని 100కు ఫోన్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపి బాధితుడు హేమకుమార్‌పైనే చిందులు వేశారు. హేమకుమార్ న్యాయం చేయాలని కోరినప్పటికి 100 కాల్ ఆధారంగా స్టేషన్‌కు పిలిపించి సదరు స్థలం వారికి చెందనదేనని, అటు వైపుకు వెళ్లరాదంటూ హెచ్చరించారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

జలదంకి: మండలంలోని గోపన్నపాళెంలోని పోలేరమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ఆవరణలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకెళ్లారు. గురువారం ఉదయం గ్రామస్తులు గుర్తించి జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో సుమారు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు నగదు ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

మైక్‌సెట్ వితరణ

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కల్లూరి మోహన్‌రెడ్డి రూ.10 వేల విలువైన పోర్టబుల్ బ్లూటూత్ మైక్‌సెట్‌ను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. గ్రామానికి చెందిన మరికొందరు దాతలు పాఠశాలకు అవసరమైన వస్తు సామగ్రిని అందజేశారని హెచ్ఎం సుబ్బారెడ్డి తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

ఉదయగిరి: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత,మెయిన్, అర్లపడియ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం శివరామిరెడ్డి, పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కావలిలో పర్యాటక శాఖ మంత్రి

కావలి: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం కావలికి వచ్చారు. వెంకటగిరి పోలేరమ్మ జాతరకు హాజరైన ఆయన విజయవాడకు తిరిగి వెళ్తూ మార్గం మధ్యలో కావలి వద్ద జాతీయ రహదారి పక్కనున్న జనసేన కార్యాలయానికి వచ్చారు. కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆహ్వానం మేరకు కావలికి వచ్చిన మంత్రి కొద్దిసేపు కార్యకర్తలతో మాట్లాడి వెళ్లారు.

ఫీల్డ్‌అసిస్టెంట్‌పై ఫిర్యాదు

సోమశిల: అనంతసాగరం మండలం కచిరిదేవరాయపల్లి పంచాయతీ పరిధిలోని దేవరాయపల్లి బిట్–2 ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బొజ్జ వెంకటరమణపై ఉపాధి కూలీలు ఎంపీడీఓకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా వెంకటరమణ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని, గత ఐదు నెలల నుంచి అతని ప్రవర్తన సరిగా లేదని, అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. గట్టు మీద ఉండి కూలీలకు హాజరు వేస్తున్నాడని, కాలువలో దిగి పనిచేసిన వారికి హాజరు వేయకుండా, పనికి హాజరుకాని వారికి మస్టర్లు వేస్తూ లబ్ధి పొందుతున్నారని, పరిశీలించి అతనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

29న మెగా ఉచిత వైద్యశిబిరం



అల్లూరు: స్థానిక దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో ఈ నెల 29న మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ మేనేజర్ అనిల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ట్రస్టు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నెల్లూరుకు చెందిన కిమ్స్ ఆస్పత్రి, వైద్యులు అన్ని రకాల వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో ఉన్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వారు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అల్లూరు చుట్టుపక్కల మండలాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ఉదయగిరి: జమాతే ఇస్లామిక్ హింద్ ఉదయగిరి శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు అనే అంశంపై ఇటీవల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ అఖిల్ చేతుల మీదుగా గురువారం బహుమతులు అందజేశారు. జమాతే ఇస్లామిక్ హింద్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆసియా, నిర్వాహకులు అల్సానియా, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



అనుమసముద్రంపేట: మండలంలోని అక్బరాబాదులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ సీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. సోమశిల కాలువ నుంచి కుంట రామయ్య పొలాల వరకు చేపడుతున్న పనులను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి రూ.300 పొందాలన్నారు. ఆయన వెంట ఏపీఓ సునీల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



చేజర్ల: మండల పరిధిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం వేకువన పట్టుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఉలవపల్లి, కొలపనాయుడుపల్లికి చెందిన ఇద్దరు పుట్టుపల్లి వద్ద ఉన్న పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెన్నా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



జలదంకి: బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వద్దే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను జలదంకిలో గురువారం ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు వంటేరు రాకేష్ రెడ్డి, ముడి కిషోర్‌రెడ్డి, కమతం బాలకోటయ్య, గణాది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీని అభివృద్ధి పథంలో నిలపాలి

సీతారామపురం: మారంరెడ్డిపల్లి సొసైటీని కావలి డీఎల్‌సీఓ యలమందరావు గురువారం తనిఖీ చేశారు. కంప్యూటరైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సొసైటీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా సొసైటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం సొసైటీకి చెందిన హెచ్‌పీ పెట్రోల్ బంకును పరిశీలించారు. ఆయన వెంట పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, సీఈఓ శ్రీనివాసులు ఉన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

ఆత్మకూరు : దేపూరుకు చెందిన ముక్కమళ్ల పిచ్చిరెడ్డి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గురువారం రాత్రి ఆరు ఫుల్ మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రంకురోడ్డుకు పార్వతమ్మ పేరు సముచితం

కావలి: పట్టణంలోని ట్రంకురోడ్డుకు కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ పేరును పెట్టడం సముచితమని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కావలిలో స్వర్గీయ మాగుంట పార్వతమ్మ చిత్ర పటానికి గురువారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డు విస్తరణ చేయాలని ఆలోచించి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ద్వారా రూ.2కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. పార్వతమ్మ జ్ఞాపకార్థంగా ట్రంకురోడ్డుకు ఆమె పేరును పెట్టాలని సూచించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అభిప్రాయానికి వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పార్వతమ్మ పట్టణంలోని 8వేల మందికి ఇంటి స్థలాలు మంజూరు చేయించి పక్కాగృహాలను నిర్మించి ఇచ్చారని గుర్తుచేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ప్రారంభించి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చారని తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్, వెంగళరావునగర్‌లో సిమెంట్ రోడ్లు నిర్మించారని చెప్పారు. తన భర్త సుబ్బరామిరెడ్డిని చంపిన నక్సలైట్లకు కోర్టు శిక్ష వేస్తే, వారిని మానవత్వంతో వదిలేయాలన్న గొప్ప దయార్ధ హృదయురాలు పార్వతమ్మ అని కొనియాడారు. ఆమె బాట రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరు మాల్యాద్రి, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, వేగూరు చిన్న పుల్లయ్య, కనుపర్తి రాజశేఖర్, సన్నిబోయిన ప్రసాద్, మునీర్,పేరం వెంకటేశ్వర్లు, వేణు,కుమారి రాజు, పుల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

ఘనంగా ఝులా ఉత్సవం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ ఖాజానాయబ్ రసూల్ వారి దర్గాలో 251వ గంధ మహోత్సవం సందర్భంగా ఝులా ఉత్సవాన్ని గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. తొలుత వక్ఫ్‌బోర్డు కార్యాలయం నుంచి ఈఓ షేక్ మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఝులాను ఫకీర్ల జరుబుల నడుమ తీసుకెళ్లి దర్గాపై ఉన్న చంద్రవంకకు అలంకరించారు. అలాగే సజ్జదానషీన్ ఎస్‌జీఎస్ హఫీజ్‌షాషా ఆధ్వర్యంలో మరో ఝులాను మహల్ నుంచి మేళతాళాలు, ఫకీర్ల జరుబుల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాపై ఉన్న చంద్రవంకకు అలంకరించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. చంద్రవంకను శుభ్రపరిచిన తీర్థాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గా ఏఈఓ షేక్ షరీఫ్, అకౌంటెంట్ ఖాజాహుస్సేన్, సజ్జద నషీన్ కుమారుడు జునైద్ పాషా పాల్గొన్నారు. ఎస్సై సైదులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా ఫకీర్ సాహెబ్ గలేఫా ఉత్సవం

గంధ మహోత్సవంలో భాగంగా ఫకీర్‌సాహెబ్ గలేఫ్ ఉత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గలేఫాను ఫకీర్‌సాహెబ్ వంశీస్తులైన షావాజ్ ఇంటి నుంచి మేళతాళాల నడుమ తీసుకొచ్చి హజరత్ వారి సమాధులపై కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. దర్గా ఈఓ షేక్ మహమ్మద్ హుస్సేన్, సజ్జదా నషీన్ ఎస్‌జీ ఎస్ హఫీజ్ పాషా, దర్గా ఏఈఓ షేక్ షరీఫ్, అకౌంటెంట్ ఖాజాహుస్సేన్, మొఘల్ రియాజ్, మొఘల్ సోహెల్, మొఘల్ రాహీల్, మొఘల్ జాకీర్ పాల్గొన్నారు.



ఝులా ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం కొత్త హరిజనవాడకు చెందిన మైనంపాటి వినోద్‌కుమార్ కుటుంబానికి జలదంకి మండల రెడ్‌క్రాస్ శాఖ అండగా చేయూతనందించింది. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మైనంపాటి కుటుంబం సర్వం కోల్పోవడంతో రెడ్‌క్రాస్ సభ్యులు వంటపాత్రలు, టార్పాలిన్, దుప్పట్లు, తదితర సామగ్రిని గురువారం అందజేశారు. రెడ్‌క్రాస్ మండల శాఖ చైర్మన్ వద్దే శ్రీనాథ్‌రెడ్డి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర విపత్తుల సమయంలో బాధితులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందన్నారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ దాకారపు రవిప్రకాష్, జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



బాధితులకు సామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

పొగాకు రైతులకు మొక్కల పంపిణీ



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో మొక్కలు నాటుతున్న పొగాకు బోర్డు అధికారులు



మర్రిపాడు: రైతులకు మొక్కల పంపిణీ

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని తురకపల్లి గ్రామంలోని రైతులకు గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రైతులకు మొక్కలను అందజేసి నాటిస్తున్నట్లు తెలిపారు. దుత్తలూరు రెవెన్యూ అధికారి నాగరాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రం ఆధ్వర్యంలో కృష్ణారెడ్డిపాళెంలోని రైతులకు గురువారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 'రైస్ యూవర్ ఓన్ ఫ్యూయల్' అనే నినాదంతో పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు మొక్కలను అందజేసి నాటించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు రావూరి శ్రీకాంత్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ మాల్యాద్రి, రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



ఆత్మకూరు: పట్టణానికి చెందిన ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా ఆయనపై ఉన్న అభిమానంతో మూడు కుటుంబాల పేదలకు నిత్యావసర సరుకులు అందజేసినట్లు ఐక్య ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. పయ్యావుల రామకృష్ణ, జయంత్, నవీన్, చందు, సుబ్బరాయుడు, మహాత్మా, తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలిలో ఓ మీడియా సంస్థలో విలేకరిగా పనిచేస్తున్న దామెర్ల శ్రావణ్‌కుమార్‌పై గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. శ్రావణ్‌కుమార్ కావలిలో పదేళ్లుగా విలేకరిగా పని చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన బుడంగుంట సమీపంలో స్కూటీపై వెళ్తుండగా పది మంది వ్యక్తులు అడ్డుకున్నారు. క్రికెట్ స్టంప్స్‌తో దాడికి పాల్పడ్డారు. శ్రావణ్‌కుమార్ గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి అడ్డుకోవడంతో దాడి చేసిన వ్యక్తులు పక్కకు వెళ్లారు. అనంతరం వారు వెళ్లిపోగానే మళ్లీ దాడి చేసేందుకు దగ్గరకు వస్తుండడం గమనించిన శ్రావణ్ స్కూటీపై వేగంగా సమీపంలోని బుడంగుంట కాలనీకి చేరుకుని సహచర విలేకరులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి అతన్ని కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేర్పించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గాయపడి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దామెర్ల శ్రావణ్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత విలేకరి శ్రావణ్‌కుమార్‌పై దారికాచి దాడికి పాల్పడడం దారుణమన్నారు. కావలిలో అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయని, అందుకు విలేకరులు కూడా బాధితులు కావడం బాధాకరమన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి ఉన్న పట్టణంలోనే ఇలాంటి దురాగతాలు జరుగుతుంటే, ఇక మండల కేంద్రాలు, గ్రామాల్లో వాటిని నివారించడం సాధ్యమేనా అని ఆందోళన వ్యక్తం చేశారు. విలేకరిపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బాధిత విలేకరిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి